ప్రగతి బాట..

- నాడు అధ్వానం.. నేడు అద్భుతం
- అద్దంలా రహదారులు
- కోట్ల వ్యయంతో సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్న రోడ్లు


మాధవధార ప్రధాన రహదారి

నాడు

ఇరుకైన రహదారులు.. అడుగడుగునా గుంతలు.. వానొస్తే బురదబురద.. ఎండొస్తే దుమ్ము.. బండెక్కితే ఉయ్యాల జంపాల.. కిలోమీటర్ దూరానికి పది నిమిషాలకుపైగా సమయం..గంటకు 20 నుంచి 30 కిలోమీటర్లు దాటని వేగం.. దారిపొడవునా కుదుపులతో ఒళ్లంతా హూనం.. ఇది నాటి టీడీపీ పాలనలో నియోజకవర్గ దుస్థితి.



నేడు

విశాలమైన రోడ్లు.. ట్రాఫిక్ సమస్య లేకుండా సాఫీగా రాకపోకలు.. కిలోమీటర్ల దూరం కూడా నిమిషాల్లోనే వెళ్లే సౌకర్యం.. గంటకు 60 నుంచి 80 కిలోమీటర్ల వాహనాల వేగం.. అంతరాయం, అలసట లేకుండా ప్రయాణం.. వానొచ్చినా.. వరదొచ్చినా ఆటంకం లేకుండా సురక్షితంగా గమ్యస్థానాలకు చేరిక.. ఇది నేటి వైఎస్సార్ సీపీ పాలనలో ప్రగతి.


50వ వార్డు తెన్నేటినగర్ కొండవైపు వెళ్ళే రోడ్డు

గత పాలకులు అభివృద్ధి విషయంలో హామీలతో సరిపెడితే..నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి చేసుకుంటూ దూసుకుపోతోంది. వార్డుల్లో అభివృద్ధి, ఆధునికీకరణ, సుందరీకరణ పనులు చకాచకా జరుగుతున్నాయి. రహదారులు అద్దంలా మెరిసిపోతున్నాయి. ప్రధాన రహదారులతో పాటు సర్వీసు రహదారులు కూడా తళతళ మెరుస్తున్నాయి. కుదుపుల్లోని ప్రయాణాన్ని వాహనదారులు ఆస్వాదిస్తున్నారు. విశాఖ నగరంలోని మురళీనగర్, మాధవధార, 50,51 వార్డుల ప్రాంతాల్లో అభివృద్ధి శరవేగంగా జరుగుతోంది. పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వార్డుల అభివృద్ధికి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వచ్చారు.

– మర్రిపాలెం


51వ వార్డు మాధవధార 'ధార' కు వెళ్లేదారి



రూ.8 కోట్లతో..

50వ వార్డు మాధవధార,మురళీనగర్ ప్రాంతంలో 10 కిలోమీటర్ల మేర బీటీ రోడ్లు,సీసీ రోడ్లు వేశారు. మెయిన్ రోడ్డుతో సహా అంతర్గత రోడ్లు వేశారు. దీనికి రూ.8 కోట్లు నిధులు మంజూరయ్యాయి. రోడ్లకు సంబంధించి 44 వర్కులు మంజూరుకాగా..35 పూర్తయ్యాయి. రోడ్ల పనులతో పాటు డ్రెయిన్లు కూడా నిర్మిస్తున్నారు. మొదలు పెట్టాల్సినవి 9 వర్కులు వున్నాయి. త్వరలోనే ఆ పనులు ప్రారంభించనున్నారు.

శరవేగంగా..

జీవీఎంసీ 51వ వార్డులో రోడ్లకు సంబంధించి 42 వర్కులు మంజూరుకాగా, 29 పూర్తయ్యాయి. మూడు రహదారుల పనులు జరుగుతున్నాయి. 9 వర్కులు ప్రారంభించాల్సి వుంది. మాధవధారలోని అన్ని ప్రాంతాల్లో రహదారులు నిర్మించారు. గతంలో ధారకు వెళ్లాలంటే రోడ్లు గతుకులమయంగా వుండేది. ఇప్పుడు పచ్చని కొండల మధ్య తళతళ మెరుస్తున్న రహదారులపై వాహనదారులు ఉల్లాసంగా ప్రయాణించే పరిస్థితి ఉంది.

50వ వార్డులో..

ప్రాంతాలు : మాధవధార, మురళీనగర్, తెన్నేటి నగర్, హరితాపార్కు ఏరియా, వాకర్స్ పార్కు ఏరియా, వర్మా కాంప్లెక్స్, శ్రీదేవి పార్కు ఏరియా, బృందావన్ పార్కు, సత్యానగర్ మెయిన్‌రోడ్డు, స్కేటింగ్ పార్కు ఏరియా
మొత్తం కి.మీ : 10 కి.మీ.
పూర్తయిన రహదారి : 8.5 కి.మీ
మొత్తం ఖర్చు : రూ.8.15 కోట్లు
మొత్తం వర్కులు : 44
పూర్తయినవి : 35
మొత్తం జనాభా : సుమారు 2 లక్షలు

51వ వార్డులో..

ప్రాంతాలు : మాధవధార వుడాకాలనీ ఫేజ్1, ఫేజ్2, కళింగనగర్, రాజీవ్ నగర్, గిరిప్రదక్షిణ రోడ్డు, సీతన్నగార్డెన్స్, మహత్ కాలనీ, గాంధీనగర్
మొత్తం కి.మీ : 9 కి.మీ.
పూర్తయిన రహదారి : 6.5 కి.మీ
మొత్తం ఖర్చు : రూ.8 కోట్లు
మొత్తం వర్కులు : 42
పూర్తయినవి : 29
మొత్తం జనాభా : సుమారు 2.5 లక్షలు

రహదారులు సూపర్



గతంలో ఎన్నడూ లేనివిధంగా రహదారులు అద్భుతంగా ఉన్నాయి. ముఖ్యంగా మాధవధార మెయిన్‌రోడ్డు చూస్తుంటే హైవేతో సమానంగా వుంది. ఫోర్‌లేన్ వేయడం ఎవరూ ఊహించలేదు. ఏదో రోడ్డు వేస్తారు అనుకున్నాం తప్పా ఇంత వెడల్పుగా నిర్మిస్తారని ఊహించలేదు. థ్యాంక్యూ సీఎం సార్...

– లంకా గిరీష్, కళింగనగర్, 51వ వార్డు

రహదారుల భేష్



ఒకప్పుడు రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు స్వార్థంతో, రాజకీయ లబ్ధి కోసం పనిచేసేవి. ఎన్నికలు వచ్చేటప్పుడు ఏదో చేయాలి అన్నట్టు మొక్కుబడిగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసేవారు. ప్రస్తుతం నేను బెంగుళూరులో జాబ్ చేస్తూ అక్కడే వుంటున్నా. చిన్నప్పటి నుంచి మాధవధారలోనే పెరిగా. గతానికి ఇప్పటికీ రూపురేఖలు మారిపోయాయి. బెంగళూరు కంటే మెరుగ్గా విశాఖ రహదారులున్నాయి. ఏపీలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల కోసమే పనిచేస్తుందని స్పష్టమవుతోంది.

– భరత్, మాధవధార, 50వ వార్డు


నాడు : 50వ వార్డు మురళీనగర్ మెయిన్ రోడ్డు దుస్థితి


నేడు : 50వ వార్డు మురళీనగర్ మెయిన్ రోడ్డు

క్లుప్తంగా

పోలింగ్ బూత్ ఏజెంట్లతో సమావేశం


ఏజెంట్లతో సమావేశమైన కేకేరాజు

సీతమ్మధార : జీవీఎంసీ పరిధి 47,48 వార్డులకు సంబంధించి వైఎస్సార్‌సీపీ ఉత్తర పార్టీ కార్యాలయంలో పోలింగ్ బూత్ ఏజెంట్లతో నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కేకేరాజు సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఏజెంట్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు కంటిపాము కామేశ్వరి, కో–1 ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, 48వ వార్డు ఇన్‌చార్జ్ నీలిరవి, జేసీఎస్ మండల కన్వీనర్ వసంతల అప్పారావు పాల్గొన్నారు.

స్వల్ప కాలిక కోర్సులకు దరఖాస్తులు

కంచరపాలెం: స్థానిక ప్రభుత్వ బాలికల పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఐటీఐ)లో పీఎంకేవీవై పథకంలో భాగంగా నిరుద్యోగ యువతకు ఉచితంగా అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అసిస్టెంట్ టెక్నీషియన్ సీసీటీవీ, స్వీఈంగ్ మెషీన్ ఆపరేటర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు బాలికల ఐటీఐ ప్రిన్సిపాల్ రమణారావు తెలిపారు. 3 నెలల స్వల్ప కాలిక స్కిల్ అప్‌గ్రేడేషన్ కోర్సులకు 18 ఏళ్లు నిండి ఎస్‌ఎస్‌సీ ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్, పాస్‌ఫొటోలు, విద్యార్హత ధ్రువపత్రాలతో కంచరపాలెం ఐటీఐ జంక్షన్‌లోని బాలికల ఐటీఐలో ఉదయం 10 గంటల నుంచి సంప్రదించాలని ఆయన కోరారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే..

మురళీనగర్: జోన్–2 డివిజన్ పరిధిలోని కప్పరాడ 11కేవీ ఫీడర్‌లో ఏఎల్59 జీబ్రా కండక్టర్ మార్పిడి పనులు కారణంగా బుధ,గురువారాల్లో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు తెలిపారు. ఈ మేరకు రామ్‌జీ ఎస్టేట్, బాపూజీనగర్ ప్రాంతాల్లో ప్రతి రోజూ ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

బానాలకు అభినందనలు


బానాల దంపతులను సత్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

సీతంపేట: జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు బానాల శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు మంగళవారం ఆయన ఇంటి వద్ద ఘనంగా జరిగాయి. కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. పలువురు నాయకులు , కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. గజమాలతో బానాల దంపతులను సత్కరించారు. బానాల తరుణ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

24న మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో క్లరికల్, టెక్నికల్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 24న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్) ఒక ప్రకటనలో తెలిపారు. హెటిరో డ్రగ్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, టీమ్ లీజ్, శరణ్ మోటార్స్, మెడ్ ప్లస్, ఫ్లిప్ కార్ట్, అడెక్కో, లాస్య ఇంజినీరింగ్ సొల్యూషన్స్, ఎస్‌వీవీ ఇన్ఫోటెక్, వీల్స్ మార్ట్, వైఎస్‌కే ఇన్ఫోటెక్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 775 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారని తెలిపారు. జూనియర్ కెమిస్ట్, ఆఫీసర్, రిటైల్ ట్రైనింగ్ అసోసియేట్, ఫార్మసిస్ట్, జూనియర్ ట్రైనీ, డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, ఆఫీస్ అసిస్టెంట్, అకౌంట్స్, టెలికాలర్, రికవరీ, క్లర్కు, బ్రాంచి ఇన్‌చార్జి, ఎగ్జిక్యూటివ్స్, సీఆర్ఈ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పీజీ, ఉత్తీర్ణత సాధించిన 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులని తెలిపారు. కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళాకు రావాలని కోరారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన

50వ వార్డులో గడపగడపకు మనప్రభుత్వంలో కేకే రాజు


ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న కేకే రాజు

మర్రిపాలెం : సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించే ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని పార్టీ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు అన్నారు. జీవీఎంసీ 51వ వార్డు వుడా కాలనీలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేసి, ప్రభుత్వ పథకాలను వివరిస్తూ, సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు ప్రజాసంకల్ప యాత్రలో వై.ఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి చూపించారని కొనియాడారు. సంక్షేమాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అమలు నిర్వహిస్తున్నామని వివరించారు. టీడీపీ హయాంలో ఏ పథకం కావాలన్నా కార్యాలయాలు, నాయకుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారావు మాస్టార్, డైరెక్టర్లు పైడి శ్రీను, దిడ్డి రమేష్, 51వార్డు సీనియర్ నాయకులు తిరుమలరావు, దమయంతి, సూర్యనారాయణ, పొన్నాడ అప్పారావు, శ్యామ్, రత్నం, శ్రీను, రామోహన్, గణేష్, సాధు, వినోద్, రాణి, చిన్ని, బాను, బోవల్లి గోవింద్, ఎం.సునీల్, గాలి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కులగణన నిర్ణయం చారిత్రాత్మకం


మాట్లాడుతున్న యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత

తాటిచెట్లపాలెం : కులగణన చేపట్టాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని ఆంధ్రప్రదేశ్ యాత వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత తెలిపారు. కులగణనపై నిర్వహించిన ప్రాంతీయ సదస్సులో పాల్గొన్న అనంతరం ఆమె మాట్లాడారు. కులగణనతో యాతలకు సమన్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యాత వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్స్ బాడితబోయిన రాములప్పుడు, పోలవరపు అప్పారావు, అండిబోయిన లక్ష్మీ, గొంప అప్పలరాజు, ఉత్తరాంధ్ర యాత సంక్షేమ సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షులు పిల్లి నూకరాజు, గొడ్డి కన్నారావు, బసరమాని ఈశ్వర్రావు, రెడ్డి సన్యాసిరావు, వనుము దేముడు, లోకేష్, అండిబోయిన అప్పారావు, అంగటి రాము, రమణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత


బాధితులకు చెక్కులు అందజేస్తున్న కేకే రాజు

సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కేకేరాజు అందజేశారు. ఈ మేరకు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని ఉత్తర పార్టీ కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని ఎనిమిది మందికి రూ.13.80 లక్షల చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ పరిధిలో లేని జబ్బులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆదుకునే చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు కంటిపాము కామేశ్వరి, కార్పొరేటర్లు రెయ్యి వెంకటరమణ, సాడి పద్మారెడ్డి, వార్డు అధ్యక్షులు పైడి రమణ, నీలిరవి పాల్గొన్నారు.

ఆ స్థలం రైల్వేశాఖదే..!


స్థానికులతో మాట్లాడుతున్న ఆర్‌డీవో

మర్రిపాలెం: జీవీఎంసీ పరిధి 53వ వార్డులోని మర్రిపాలెంలోని వాటర్‌ట్యాంక్ స్థలాన్ని మంగళవారం రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్‌డీవో) మంగళవారం పరిశీలించారు. ఇక్కడి పెంట కోస్టల్ చర్చి, రైల్వే క్వార్టర్ల మధ్య గల స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ స్థలం రైల్వేశాఖదే అని స్పష్టం చేశారు. ఈ స్థలంపై నిర్ణయాధికారం రైల్వే డివిజనల్ మేనేజర్ (డీఆర్‌ఎం)దే అన్నారు. చర్చికి వెళ్లేందుకు పడుతున్న ఇబ్బందులను రైల్వే డీఆర్‌ఎం దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు.

జగనన్నతో ఏపీ అభివృద్ధి

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


ప్రభుత్వ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి, కార్పొరేటర్ అనిల్ కుమార్‌రాజు

సీతమ్మధార : జగనన్నతోనే ఏపీలో అభివృద్ధి సాధ్యమని, పేదల కళ్లల్లో ఆనందం చూడాలంటే మళ్లీ జగన్నే సీఎం చేసుకోవాలని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం 14 వార్డు కార్పొరేటర్ కటారి అనిల్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో వార్డులోని (1086111) సచివాలయం ఆర్‌అండ్‌బీ క్వార్టర్స్ జీవీఎంసీ పార్కులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భీమిలి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా సచివాలయ పరిధిలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పనులు వివరాలతో కూడిన బోర్డును ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసిన గొప్ప నేత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ మండల అధ్యక్షురాలు జి.వి.రమణి, ఏపీడీ దుర్గాప్రసాద్, మండల కన్వీనర్లు మురళీకృష్ణారెడ్డి, వార్డు నాయకులు తాడి జగన్నాథరెడ్డి, కె.సత్యనారాయణ, బి.శ్రీను, కె.సుశీల, రాజ్‌కుమారి, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సరకు రవాణాలో లక్ష్యాలు చేరుకోవాలి


మాట్లాడుతున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): సరకు రవాణాలో నిర్దేశించిన గమ్యాలు చేరుకునేందుకు అంతా సమష్టి కృషితో పనిచేయాలని డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ అన్నారు. దొండపర్తిలోని డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో మంగళవారం అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శక్తివంతమైన నిర్ణయాలు, ఖర్చు ఆదా చేసే వివిధ పద్ధతులు అనుసరించి గమ్యాలు చేరుకోవాలన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పరిశ్రమలకు అవసరమైన రేక్‌లను సమకూరుస్తూ, త్వరితగతిన డబ్లింగ్ పనులను పూర్తిచేస్తూ వాల్తేర్ డివిజన్ ముందుకు సాగుతోందన్నారు. ప్రత్యేకంగా ముడి ఇనుము సరఫరాకు గతేడాది కంటే సుమారు 25శాతం రేక్‌లను పెంచినట్లు తెలిపారు. సమావేశంలో వాల్తేర్ డివిజన్ వ్యాపార భాగస్వాములైన నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌ఎండీసీ), వైజాగ్ స్టీల్‌ప్లాంట్, గంగవరం పోర్టు, కుద్రేముఖ్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ, జిందాల్ స్టీల్ సంస్థల నుంచి ప్రతినిధులతో పాటు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ జి.సునీల్‌కుమార్, ఆపరేషన్స్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు కొండవాలు ప్రాంతం సింగాలమ్మపురం కాలనీలో పలు అభివృద్ధి పనులకు వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు ఆదేశాలతో వార్డు అధ్యక్షుడు పైడిరమణ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఇటీవల గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి పలు సమస్యలను స్థానికులు తీసుకువెళ్లారు. ఈమేరకు ఆయన ఆదేశాలతో జీవీఎంసీ అధికారులు నిధులు మంజూరు చేయడంతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో సింగాలమ్మపురం కాలనీ అధ్యక్షుడు బాబూరావు, కారుకొండ రాజు యాదవ్, నేపాల్ శ్రీను, జీవీఎంసీ, సచివాలయ సిబ్బంది, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం కొనసాగించాలి

తాటిచెట్లపాలెం : రైల్వే ఉద్యోగులకు కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని కోరుతూ ఈస్ట్‌కోస్ట్‌రైల్వే శ్రామిక్ యూనియన్ ఆధ్వర్యంలో వాల్తేర్ డివిజన్ పరిధిలో గల ఆయా బ్రాంచ్ కార్యాలయాల వద్ద స్ట్రైక్ బ్యాలట్ నిర్వహించారు. మంగళవారం వాల్తేర్ డివిజన్ ఇంజినీరింగ్ విభాగం ఫీల్డ్ సిబ్బందికి ఈస్ట్‌కోస్ట్‌రైల్వే శ్రామిక్ యూనియన్ నాయకులు కొత్త పెన్షన్ విధానం గురించి వివరిస్తూ, ఈ విధానం వలన ఎలా నష్టపోతున్నారో తెలియజేశారు. కార్యక్రమంలో ఈస్ట్‌కోస్ట్‌రైల్వే శ్రామిక్ యూనియన్ బ్రాంచ్ సెక్రటరీలు బి.సోమేశ్వరరావు, సూర్యప్రకాష్, డివిజనల్ కో ఆర్డినేటర్ పీవీజీ రాజు, ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ (న్యూఢిల్లీ) జోనల్ సెక్రటరీ దామోదరరావు పాల్గొన్నారు.

'కాశీ'కి రైలు మంజూరుతో సంబరాలు

తాటిచెట్లపాలెం: విశాఖ–వారణాసి –విశాఖ మధ్య వీక్లీ రెగ్యులర్ స్పెషల్ బుధవారం నుంచి ప్రారంభం కానున్న సందర్భంగా మంగళవారం బీజేపీ రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు, పార్టీ శ్రేణులు విశాఖ రైల్వేస్టేషన్‌లో సంబరాలు జరుపుకున్నారు. ఈ రైలు మంజూరైన సందర్భంగా శాస్త్రోక్తంగా, వేదపండితుల మంత్రోచ్చరణలతో జైశ్రీరామ్ నినాదాలతో రైల్వేస్టేషన్ సందడిగా మారింది. ఈ రైలు మంజూరు చేసినందుకు ప్రధాని మోదీకి, రైల్వే మంత్రి అశ్వినివైష్ణవ్‌కు జీవీఎల్ ధన్యవాదాలు తెలిపారు.